# "వాసన లేని పువ్వా!

బాలం వెంకటరావు

వర్షం కురిసి కురిసి చల్లగా వెలిసింది. గాలి వీస్తోంది. తోటలోని చెట్లు వణికేలా వీస్తోంది గాలి ఆకాశంలో మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. పెద్ద పెద్ద ఉరుములతో ఆకాశం మెరుస్తోంది. చినుకులు ఇంకా అడపాదడపా పడుతూనే వున్నాయి. గోదావరి స్టేషనులోని లైట్లు ప్రకాశిస్తున్నాయి. రైలు గోదావరి బ్రిడ్జిమీదకు నెమ్మదిగా సాగుతూంది. వానకు తడిసిన రోడ్డు ఫ్లోరొసెంట్ దీపాల కాంతితో మెరుస్తూంది.

కాకినాడ - రాజమండ్రి బస్సు దిగాడు శ్రీధర్. క్షణం సేపు రోడ్డు ప్రక్కన నిలబడ్డాడు. జేబు రుమాలు తీసి నెత్తిమీద వేసుకున్నాడు. దగ్గరలో ఉన్న హోటల్‌కి వెళ్ళాడు. కొన్ని మెతుకులు తిని హోటల్‌లోంచి బయటపడ్డాడు. సోడా కొట్టు దగ్గర వక్కపొడి పొట్లం తీసుకొని వక్కపొడి నోట్లో వేసుకుని సిగరెట్ వెలిగించాడు. ఇప్పుడు ఇంటికి వెళ్ళటమా మానటమా అన్న సందిగ్ధావస్థలో పడ్డాడు శ్రీధర్. వాచి చూసుకున్నాడు పావు తక్కువ తొమ్మిది గంటలు చలిగాలి రివ్వున వీస్తోంది. చలికి శరీరం వణుకుతోంది. ఒళ్ళు ఐస్ గడ్డలా చల్లగా వుంది. ఆ చల్లదనం పోవాలంటే వేడి కావాలి. ఆ వేడికి శరీరం సమశీతోష్ణంగా వుంటుంది వేడి లేనిదే తనకు నిద్రపట్టదు వెచ్చదనం కోరుతోంది శరీరానికి స్త్రీ స్పర్శే వెచ్చదనం! అదే మంచివేడి! తనకు అదే కావాలి! ఇంటి వద్ద భార్యలేదు!

అయిపోయిన సిగరెట్ పీకను దూరంగా విసిరి మరో సిగరెట్ తీసి వెలిగించాడు. అయినా ఆ వెచ్చదనం ముందు ఈ వెచ్చదనం ఏపాటిది.

భార్య శారద పుట్టింటికి వెళ్ళింది. శ్రీధర్ ఏదో పనిమీద కాకినాడ వెళ్ళాడు. పని చూచుకొని వెంటనే బయల్దేరి రాజమండ్రి వచ్చేశాడు.

ఇంటికి వెళ్ళటమా మానటమా అన్న క్రియలోని రెండోదానినే తన మనస్సు ఆమోదించింది.

* * *

శ్రీధర్ ఆలోచనలతో ఒక యింటిముందు రిక్షా దిగాడు. చూడటానికి సంసారుల ఇల్లులా వుందా మేడ. కాని అది వ్యభిచారపు కొంప. అప్రక్కనున్నది కూడ వ్యభిచారపు గృహాలేనని యిట్టె ఊహించుకోవచ్చు. ఊహించుకోవటమేమిటి సెంట్ పర్ సెంట్ కరెక్టు

రిక్షా శబ్దం విని లోపల్నుంచి ఎన్నెండూ పద మూడు సంవత్సరాల అమ్మాయి పరుగెత్తుకొచ్చింది. అతిధుల్ని ఆహ్వానిస్తున్నట్లుగా శ్రీధర్‌ని లోపలికి తీసుకెళ్ళింది. ఆ కొంపని అంటే ఆ యింట్లో వ్యభిచారిణులుగా జీవిస్తున్న పడుచులకు యజమాని చిరునవ్వుతో ఎదురొచ్చాడు. తక్కువ రేటు దగ్గర్నుంచి హెచ్చు రేటు వరకూ వరుసగా చదివి ఏ రేటులో కావాలని అడిగాడు యజమాని. శ్రీధర్ చెప్పాడు.

శ్రీధర్ ఇంటికి చేరుకునేటప్పటికి అర్ధరాత్రి దాటింది. ముసుగుతన్ని హాయిగా నిద్రపోయాడు.

* * *

మరునాడు శ్రీధర్ ఆఫీసుకు వెళ్ళాడన్న మాటే గాని అతని మనస్సు మానస్సులో లేదు. తన మనస్సెందుకో గతరాత్రి గడిపిన "ఆమె" వైపే పోతోంది తన మనస్సు ఆమెను కాంక్షించు తోంది. దానికి కారణం ఆమె సౌందర్యమే కావచ్చు లేక మక్కువే కావచ్చు ఏమైనప్పటికి ఆమెవద్దకు మరల వెళ్ళాలి. శ్రీధర్ నిశ్చయించుకున్నాడు.

భార్య లేకపోవటం అతనికి మరింత స్వేచ్ఛ నిచ్చింది. ఆ రాత్రికి మరల ఆమెవద్దకువెళ్ళాడు. తనకు కావలసినవన్నీ సుఖాల్ని చూరగొన్నాడు.

ఇలా రెండు మూడు రోజులకొకసారి శ్రీధర్ ఆమెవద్దకు వెళ్తూనే వున్నాడు శ్రీధర్‌కి ఆమె అంటే ఒకవిధమైన ప్రేమ ఏర్పడింది. ఆమె ఎడల అభిమానం అధికమౌతుంది వేశ్యలలో కూడ మంచి మనస్సున్నవాళ్ళు వుంటారనిపించింది. శ్రీధర్‌కి. తన మనస్సు ఆమెవద్దకే పోతోంది. అది ఆకర్షణో. అనుబంధమో లేక అనుబంధం లాంటి ఆకర్షణో! తనకే తెలీదు.

వారంరోజులు గడిచాయి

శ్రీధర్ భార్య పుట్టింటినుంచి వచ్చింది.

శ్రీధర్ "ఆమె" వద్దకు రాకపోకలు సాగిస్తూనే వున్నాడు అసలు తను ఇన్నిరోజుల్నుంచి వెళ్తున్నాడన్న మాటేగాని ఆమె పేరేమిటో కూడ తెలుసుకోలేకపోయాడు. తన ఆలోచనకు తనకే నవ్వొచ్చింది....అయినా వేశ్యలు నిజమైన పేరు చెబుతారేమిటి! ... కాని ఈమె అలాకాదు! అడిగితే నిజమే చెప్పవచ్చు" అనుకున్నాడు శ్రీధర్. మనసులో ఆమె చరిత్ర తెలుసుకోవాలన్న ఆలోచన కూడ కల్గింది అతనిలో, ఆమె గత జీవితాన్ని తెలుసుకోవాలన్న కుతూహలం ఎక్కువైంది.

శ్రీధర్ ఆరోజు సాయంకాలం భోజనం త్వరగా ముగించేసాడు. భార్యతో సినిమాకు వెళ్తున్నానని చెప్పి "ఆమె" వద్దకు బయల్దేరాడు.

శ్రీధర్ రాగానే ఆమె చిరునవ్వుతో ఆహ్వానించింది. "నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడదలచి వచ్చాను!" అన్నాడు శ్రీధర్ మంచంమీద కూర్చుంటూ.

"నాతో అంత ముఖ్యమైన విషయమా! ఏమిటబ్బా!.. అదేగాని నాతో మరో పనేమీలేదా మీకు!" ఆమె నవ్వుతూ వ్యంగ్యంగా అంది. ఆమె అన్న చివరిమాటలకు శ్రీధర్ చిన్నగా నవ్వాడు ఇంతలో ఒక అమ్మాయి పళ్ళెంలో తాంబూలం, బ్రాందీ గ్లాసుతో వచ్చింది. "తీసుకోండి" అంటూ తాంబూలం శ్రీధర్ చేతిలో పెట్టింది ఆమె. షుబుతోంది రెండు రూపాయల



నోటుతీసి పళ్ళెంలో పెట్టాడు. బ్రాందీ గ్లాసు టేబుల్ మీద పెట్టి సంతోషంతో వెళ్ళిపోయిందా అమ్మాయి. తాంబూలం నముల్తూ గోడలమీద వ్రేలాడుతున్న అర్ధ నగ్న సినీతారల క్యాలెండర్లను, నగ్నంగావున్న బొమ్మలను చూస్తున్నాడుశ్రీధర్.

కొన్ని నిముషాలు దొర్లాయి.

"నీ పేరేమిటి ?" తను అనుకున్న అసలువిషయం అడిగాడు శ్రీధర్. శ్రీధర్ ప్రశ్నకు ఆమె ఫక్కున నవ్వింది. నవ్వినప్పుడు మరింతఅందంగా కనిపించింది. శ్రీధర్ కి ఇంత సౌందర్య రాశి, మంచి మనస్సుగల ఈమె ఇటువంటి హేయమైన జీవితానికి ఎలా గురి అయిందా అనిపించింది శ్రీధర్ మనసుకి.

"నా పేరా ? ఏం తెలుసుకోవాలనివుందా ?" ఆశ్చర్యంగా నవ్వుతూ అంది ఆమె.

"అవును !...పేరే కాదు నీ గత జీవితాన్నికూడా తెలుసు కోవాలని వుంది !" శ్రీధర్ సిగరెట్టు వెలిగిస్తూ అన్నాడు.

"తుచ్ఛమైన బ్రతుకు బ్రతికే నా గురించి ఏమితెలుసు కుందామను కుంటున్నారు !... అయినా ఇన్నాళ్ళకెందు కొచ్చిందా అనుమానం !" ఆమెశ్రీ ధర్ వైపు చూస్తూ అంది.

"తెలుసు కోవాలన్న ఆలోచన ఎందుకొచ్చినదో గాని ! తెలుసుకుందా మనిపించింది ! నువ్వు చెబుతావనే అడిగాను !" శ్రీధర్ ఆమె ముఖంలోకి చూస్తూఅన్నాడు.

"చెబుతాను ! తప్పక చెబుతాను ! నా ఈ నికృష్ట జీవితానికి దారి తీసిన గాథనంతా మీ

(మిగతా 51 వ పేజీలో)




# వాసనలేని పువ్వు

(44 వ పేజీ తరువాయి)

వంటి సహృదయులకు చెప్పకపోతే ఇంకెవ్వరికి చెప్పుకోను ? ఆమె తల దించుకుంది. నేలకేసి చూస్తోంది. శ్రీధర్ ఆమెముఖంలోకి చూసాడు. అప్పటి వరకున్న సంతోషం ఆమెలోలేదు. అంతవరకున్న సంతోషమైనా అది కృత్రిమమైనది మాత్రమే ! ఆమె మోము కళావిహీనమయ్యింది. ఆమె వదనంలో నైరాశ్యం గోచరిస్తోంది. ఎంతో విలువయిన దానినేదో చేతులారా పోగొట్టుకున్న భావన ఆమె విచార ఛాయల వలన వెల్లడవుతోంది.

కొన్ని క్షణాలు ఇద్దరిమధ్యా భారంగా దొర్లాయి.

"అవి నేను కాలేజీలో చదువుకుంటున్న రోజులు. కాలేజీ చదువులకు వెళ్ళటంతోనే యువతీ యువకులు తమకు ఎక్కడలేని స్వాతంత్ర్యం వచ్చినట్టు ప్రవర్తిస్తారు ! ప్రెసిడెంట్ ఎలక్షను దగ్గర్నుంచి ప్రేమకలాపాల వరకు సాగిపోతాయ్ ! కాలేజీ జీవితం కొందరికి మంచి వరాన్నే ప్రసాదించవచ్చు ! కాని నా దుర్భర జీవితానికి కాలేజీ జీవితమే నాందీ అయింది. నేను చదివే క్లాసులోనే శ్యామలరావు అనే అతను వుండేవాడు. అతను పొరుగూరునుండి వచ్చి ఒక రూము అద్దెకు తీసుకొని అందులో వుంటూ చదువుకుంటున్నాడు. అతను అందంగానే వుండేవాడు. ఒకరోజున ! సాయంకాలం కాలేజీ వదిలారు, నేను ఇంటికి నడిచివెళ్తున్నాను. శ్యామలరావు వెనుకగా "ఏమండీ కెమిస్ట్రీ నోట్సు ఒకసారి ఇస్తారా !" అంటూ నన్ను సమీపించాడు. క్లాసుమేటు, ముఖపరిచయం వుంది కాబట్టి "త్వరగా ఇచ్చేయండి" అంటూ నేను పుస్తకం అతనికిచ్చాను. అతడు వెళ్ళిపోయాడు. మరునాడు మధ్యాహ్నం లంచ్ టైములో అతను కన్పించి పుస్తకం ఇచ్చి నవ్వుతూ వెళ్ళిపోయాడు.

ఇలా అప్పుడప్పుడు ఏవో నోట్సు కావాలని అడిగి పట్టుకెళ్తుండేవాడు. నేనూ నాకు కావలసినవి అడిగి తీసుకునేదాన్ని, ఈ విధంగా మా ఇద్దరిమధ్యా పరిచయం పెరిగింది. కొన్నాళ్ళకు పరిచయం క్రమంగా ఇద్దరిమధ్య చనువు ఏర్పడింది. ఫలితంగా ఏకవచనంలోనే సంబోధించుకునే వాళ్ళం. ఒకరోజున కాలేజీ అవగానే ఇంటికి వెళ్తుండగా శ్యామలరావు రోడ్డుకార్నర్‌లో ఎదురయ్యాడు. "నీ కభ్యంతరం లేకపోతే నాదో రిక్వెస్ట్ !" అన్నాడు. ఏమిటన్నట్టు అతని ముఖంలోకి చూసాను. "ఈరోజు నా బర్త్‌డే ! కాబట్టి నా ఆతిథ్యం స్వీకరించాలని కోరిక !" అన్నాడు శ్యామలరావు నవ్వుతూ. "కంగ్రాట్యులేషన్స్ !" అన్నాను నవ్వుతూ.

అతడు దూరంగా నున్న హోటల్‌వైపు దారి తీసాడు. నేను అతనిని అనుసరించాను. తెలుసున్నవాళ్ళు ఎవరైనా చూస్తే బావుండదేమో ! అందులోనూ ఒక పరాయి పురుషుడితో అలా కలిసి వెళ్ళటం భావ్యమనిపించలేదునాకు. కాని స్నేహభావంతో మనస్ఫూర్తిగా ఆహ్వానించినపుడు వెళ్ళకపోవటం అంత సభ్యత కాదనుకుని అతనితో హోటల్‌కి వెళ్ళాను. ఇద్దరం ఓ మూలగా వున్న టేబుల్‌వద్ద కూర్చున్నాం. శ్యామలరావు కొన్ని స్వీట్స్‌కి ఆర్డరిచ్చాడు. "నా మీద నీ అభిప్రాయమేమిటి ?" అతను అడిగాడు ఎటోచూస్తూ. "అభిప్రాయానికేం ! సదభిప్రాయమే ! తెలివిగలవాడవు సంస్కారవంతుడవు, అందగాడవు ! అంతకు మించి మంచి మనసున్నవాడవు!" అన్నాను. "అదికాదు ! సరిగా చెప్పు!" అన్నాడు. "నేనేం వంకరగా చెప్పలేదే !... సరిగాఅంటే!" అంటూ కొంటెగా అతని ముఖంలోకి చూసాను. "ఆ డొంకతిరుగుడు సమాధానం మాని నేనంటే నీకు ప్రేముందా లేదా ?" నా ముఖంలోకి చూస్తూ నెమ్మదిగా అన్నాడు శ్యామలరావు. "ప్రేమ"అన్న మాటకు నాకు ఎక్కడలేని సిగ్గు ముంచుకొచ్చింది. అప్పటివరకు నాలో దాగివున్న స్త్రీత్వం నన్ను మేల్కొలిపినట్టయింది. స్త్రీ పురుషుడి ముందు ఎప్పుడు సిగ్గుపడుతుందని అంటే అతని అంతర్యంలోని అనురాగాన్ని ఆమె (స్త్రీ)కి తెలియపరచే టప్పుడే అని అన్పించిందా క్షణాల్లో. ఆనందమంతా ఆ "ప్రేమ" అనే మాటలోనే యిమిడి వుంది. ఆ ఆనందంలోంచి కొన్ని క్షణాలకి గాని తేరుకోలేకపోయాను. సిగ్గుతో తల వాల్చేసుకున్నాను. ఇంతలో సర్వరు స్వీట్సు తీసుకొచ్చాడు. ఇద్దరం స్వీట్సు తిని కాఫీ త్రాగి హోటల్‌లోంచి బయటికి వచ్చాం. "ఫస్టు షో పిక్చర్‌కి వెళ్దాం" అన్నాడు. నాకు వెళ్ళటానికి మనస్సంగీకరించలేదు. ఎరుగున్న వాళ్ళెవరైనా కనపడతారేమో. ఇంటికి త్వరగా వెళ్ళకపోతే ఆరాలు తీస్తారేమో ! అందులోనూ ఒక ఆడది స్వతంత్రంగా ఇష్టం వచ్చినట్లు తిరగటం అనేక అనర్థాలకు దారితీస్తుందేమో నన్న ఆలోచనలు నా మనస్సులో మెదిలినయ్. "నేను రాను" అని చెప్పేశాను. అతనికీ బలవంతం పెట్టటం యిష్టంలేక "సరేలే... రేపో మెప్పుడో వెళ్ళొచ్చు" అన్నాడు. "ఇక ... నేను ఇంటికి వెళతాను." అని బయలుదేరాను. "రేపు మరల ఇదే టైముకు రావాలి !" అంటూ శ్యామలరావు రూమువైపు దారి తీశాడు. నేను రిక్షా చేసుకొని యింటికి వెళ్ళిపోయాను. ఆ రాత్రంతా నా మనస్సు ఆనందంతో నిండిపోయింది. ఏవేవో తియ్యటి ఊహల్లో కలలు గంటూ నిద్రపోయాను.

మరుసటి రోజున వర్షం విపరీతంగా కురవటంతో ఇద్దరం కలుసుకోవటానికే కుదరలేదు.

రోజులు గడుస్తున్నాయి.

అతనంటే నాకు ప్రేమ, వ్యామోహం ఎక్కువయినాయి. క్షణంకూడ అతనిని చూడకుండా ఉండలేకపోతున్నాను. అతని పరిస్థితీ అలాగే వుంది. అప్పుడు నాకనిపించింది ప్రేమంటే ఇంత తీయమైనదేమోనని. పుస్తకాలు పుచ్చుకోడం దగ్గర్నుంచి ప్రారంభమైన పరిచయం ప్రేమగా మారటం నాకు చాల ఆశ్చర్యాన్ని కల్గించింది.

ఒకరోజు శ్యామలరావు పట్టుదలమీద సినిమాకు వెళ్ళాను సినిమా వదిలారు. "ఇంటికి వెళ్ళిపోతావా !" అన్నాడు నా చేతిని తీసుకుని నా ముఖంలోకి చూస్తూ. అతని కళ్ళు మత్తుగా వున్నాయి. ఆ కళ్ళు పేటినో బంధిస్తున్నట్లున్నాయి. అతని స్పర్శ తగలగానే నా నరాలు జివ్వుమన్నాయ్. శరీరమంతా విద్యుత్తు ప్రాకినట్టయింది. నాలో మైకం కమ్ముకుంది. "వెళ్ళను" అప్రయత్నంగానే నా నోటినుంచి వచ్చింది.

శ్యామలరావు రూముకి దారితీసాడు. నేను అతని వెనక నడిచాను. తాళం తీసి లోనికి నడిచాడు. నన్నేదో భయము. లజ్జ ఆవరించినయ్. నేను బయటే నిలబడిపోయాను. నేను లోపలికి వెళ్ళకపోవడం చూసి అతను బయటికి వచ్చి నన్ను నడుంమీద చేయివేసి గదిలోకి తీసుకెళ్ళి తలుపు గడియపెట్టాడు. లైటార్పి నన్ను మంచం మీదకు లాక్కొని తన వశం చేసుకున్నాడు. నేను ఎదురు మాట్లాడలేకపోయాను. ఏదో స్వర్గలోకంలో తేలిపోతున్నట్టనిపించింది. అనిర్వచనీయమైన సౌఖ్యాలను చవిచూస్తున్నట్టనిపించింది. ఆరోజు ఏదో కొత్త జీవితంలోకి అడుగుపెట్టినట్టనిపించింది.

నేను ఇంటికి చేరేటప్పటికి పన్నెండయింది. నేను ఎక్కడకైనా వెళ్ళి ఆలస్యంగా వస్తే అంతసేపు వున్నావే అని అడిగేవారు. స్నేహితురాలితో సినిమాకువెళ్ళానని చెప్పేదాన్ని శ్యామలరావు తనివి తీరేగాని నామనసు మనసులో వుండేది కాదు. అతనికీ అలానే వుండేది. రోజూ ఏదో వేళలో కలుసుకునే వాళ్ళం. ఈ విధంగా మా ఇద్దరి మధ్య అన్యోన్యం అల్లుకుపోయింది. మా విషయం చూచాయగా నాతల్లి దండ్రుల దగ్గరకు ప్రాకింది. నన్ను మందలించారు. నన్ను చదువు మానిపించేదామన్నంత వరకూ వచ్చింది. నే నేమి మాటలాడలేదు. ఈ విషయం శ్యామలరావుతో చెప్పాను. "మరి ఏంచేద్దాం ?" శ్యామలరావు నాముఖంలోకిచూస్తూఅడిగాడు "ఏంచేద్దాం". నాకూ ఏమి తోచక ఎదురు ప్రశ్న వేసాను. కొన్ని క్షణాలు ఆలోచించి "మనం ఇక్కడనుంచి క్యాంపు మార్చేద్దాం" అన్నాడు. ఆ మాట వినటముతోనే నా గుండెఝల్లుమన్నది. "లేచి పోవడం" కి ఇన్‌డైరెక్టు "క్యాంపు మార్చేయడము" నిమిషం సేపు ఏమీ మాటలాడ లేకపోయాను. పోనీ నా తల్లిదండ్రులు మా వివాహానికి ఒప్పుకుంటారా అంటే శ్యామల రావుతో చనువుగా వుంటున్నానన్న సంగతి తెలిసే నన్ను చదువు మానిపించేద్దామనుకున్నప్పుడు ఇప్పుడు వివాహప్రసక్తి వస్తే అందులోనూ కులాంతర వివాహమంటే నన్ను కదలనివ్వకుండ నాలుగు గోడలమధ్య బంధిస్తారు. కాని శ్యామలరావుని వదలి క్షణముండలేను. పడతి జీవితానికి పతి ముఖ్యంగాని తల్లిదండ్రులు కాదు. తల్లిదండ్రులు కని పెంచినవారై కావచ్చు. పెంచి పెద్ద చేయటం వరకే వారి విధి. తర్వాత తనకు నచ్చిన జీవిత భాగస్వామిని ఎంచుకొని మనుగడ సాగించటమే మగువకు [illegible]

అవును! నాకు శ్యామలరావే జీవిత భాగస్వామి "సరే! అలాగే చేద్దాం!" అనేసాను శ్యామల రావుతో.

ఒకనాటి రాత్రి నా బట్టలన్నీ సూట్‌కేసులో సర్దుకుని రెండువందల రూపాయలు పట్టుకొని స్టేషనుకి వెళ్ళాను. శ్యామలరావు బట్టలు పట్టుకొని తనొక నాలుగైదు వందల రూపాయలతో వచ్చాడు. ఇద్దరం రైలుఎక్కి తెల్లవారేటప్పటికి గుంటూరు చేరుకున్నాం.

అరండల్‌పేటలో ఒక గది దొరికింది. ఫామిలీ పోర్షన్ అవటంతోనే చాల తేలికగానే ఇల్లు దొరికింది.

కొత్తసంసారంకాబట్టిశ్యామలరావు బజారుకెళ్ళి వంటసామగ్రి కొన్ని నిత్యావసర సరుకులు కొనుక్కొచ్చాడు.

కొద్దిరోజులు గడిచాయి.

సంసారమనే శకటం నడవాలంటే సంపాదన అనే ఇంధనం ముఖ్యం కాబట్టి శ్యామలరావు పొగాకు కంపెనీలో గుమాస్తాగా చేరాడు. అతను పట్టుకొచ్చే జీతం రాళ్ళతో లోటు లేకుండా సంసారం సాగిపోతూంది. క్రమక్రమంగా నా మనస్సు తలిదండ్రులకు పూర్తిగా దూరమవుతోంది. శ్యామలరావు నన్నెంతో ప్రేమగా చూస్తున్నాడు. నాకు ఏమాత్రం కొద్ది నలతగావున్నా తన ప్రాణానికన్న మిన్నగా చూసేవాడు. అనురాగానికి నిలయమైన ఒక హృదయం నుంచి ఆత్మీయతను పొందటం నా అదృష్టమనిపించింది, స్త్రీకి అన్నివిధాల నచ్చిన భర్త లభించి ఆమె సంసార జీవితం పూలబాట అయినప్పుడు ఆ బాటలో నడవటం తప్ప ఆమెకు మరేం కావాలి! నా కాలేజి, నా స్నేహితురాళ్ళు, నా తలిదండ్రులు నా అక్క, తమ్ముళ్ళు అందర్నీ మర్చిపోయాను. బాహ్య ప్రపంచాన్నే మర్చిపోయాను.

ఆనందంగా వుంటే రోజులు క్షణాల్లా ఇట్టే గడిచిపోతాయి. అప్పుడే కొన్నిమాసాలు గడిచాయి. నాకు బాబు పుట్టాడు. కొన్నిరోజులు మామూలుగానే గడిచిపోయాయి. శ్యామలరావు ప్రవర్తనలో విసుగు జనిస్తోంది. మాటి మాటికీ చిరాకు పడటం క్రమేణా అతని ప్రవర్తలో అతను మాట్లాడే ధోరణిలో పూర్తిగా మార్పు వస్తోంది. క్రమక్రమంగా శ్యామలరావులో ప్రేమ సన్నగిల్లుతోంది. ఇంతకుముందు నాపై చూసే ఆప్యాయత, అనురాగం ఇప్పుడు ఎందుకు అతని నుంచి దూరమయ్యాయో నాకు అర్థంకాలేదు. ఒకరోజున,

"ఏమండీ! బాబుకు పాలడబ్బా ఒకటి కొనుక్కురండీ! పాలు చాలటంలేదు!" అన్నాను.

"పాలడబ్బాలు పొదర్లూ తేవటానికి నేనేం మడిగట్టు కూర్చోలేదు!" కోపంగా అన్నాడు.

"అదేమిటండీ! పసివాడు పాలు లేక ఏడుస్తుంటే మీకు మనస్సెలా ఒప్పుతుందండీ!"

"పాలు వుంటే నేం! లేకపోతే నేం! నా కనవసరం"

"మీకు అనవసర మనకండి! మనిద్దరికీ అవసరమే! బాబును మీరూ నేనూ కూడ చూడకపోతే ఏమౌతాడు!" నాకూ కోపం అధికమైంది.

"ఇకముందు నా కేమీ కాదు! మిగిలిన గొడవలతోనూ, నీతోనూ కూడ నాకు సంబంధం లేదు." అంటూ విసురుగా బయటికివెళ్ళిపోయాడు. నిశ్చేష్టురాలినై కొన్ని క్షణాలు నిలబడిపోయాను. కానేపు మెదడుపనిచేయలేదు. అతనిలోనిహఠాత్పరిణామానికి ఆశ్చర్య మేసింది. అతను అనిన చివరి మాటలు నాకు సరిగా అర్థంకాలేదు. తన ప్రాణంతో సమానంగా ప్రేమించే శ్యామలరావు ఆ విధంగా మాట్లాడడంతో నాకు మతి చలించినట్లయింది. ఎప్పుడూ ఇష్టంగా వుండి తనని మనస్ఫూరా ప్రేమించిఆరాధించేమనిషి క్రూరంగా ప్రవర్తిస్తే ఆమె మనస్సు ఎంత రోదిస్తుందో అని అంటే అందుకు నేనే నిదర్శనం. పోనీ ఆర్థిక బాధల వలన పాలడబ్బా తేలేదు. అని అనుకుందా మన్నా అతను అనిన చివరి మాటలు నా హృదయాన్ని గాయ పరిచినయ్. ఆ రోజంతా నా మనస్సు అల్లకల్లోలంగా వుంది. తెల్లవారింది. శ్యామలరావు కన్పడ్డంలేదు. గదిలో బట్టల పెట్టె లేదు. కొయ్యబారి పోయాను. అతడు నిన్న అనిన మాటలు గుర్తొచ్చాయి. "ఇక ముందు నాకేమీకాదు! మిగిలిన గొడవల్తో నీతోనూకూడా నాకు సంబంధంలేదు!" కళ్ళనీరు కట్టలు త్రెంచుకుంది. ఆవేదనకు అవధులు లేవు. నన్ను నా బిడ్డని. అన్యాయంచేసిపోయాడు! ఇన్నాళ్ళు నన్ను ప్రేమించి ఇప్పుడు అగాధంలోకి విసిరి పోయాడు. ఇప్పుడు నాకు గతెవరు! నాన్నేడి అని అంటే ఆ బిడ్డకు ఏమని చెప్పాలి!... రాక్షసుడు. అంతా నటన! ప్రేమిస్తున్నానంటే ఉబ్బిపోయిసర్వస్వం అర్పించుకున్నాను! పిల్లవాడు పుట్టగానే ప్రేమానురాగాలు అన్నీ వదిలిపోయాయ్! అతనిలోని ప్రేమ గని తరిగిపోయింది. కామ వాంఛల్ని తీర్చుకోవటం కోసం వంచించి నా జీవిత పతనానికి కారకుడయ్యాడు. ఎవరినైతే నా మనస్ఫూర్తిగా ప్రేమించి పతిగా భావించి ఆరాధించానో ఆ వ్యక్తే నన్ను నడిసముద్రంలోకి విసిరేసి తన దారిన పోయాడు. రైలు ప్రయాణికుల్లాగే విచిత్రంగానే కలుసుకున్నాం. అంతకు వింతగానే విడిపోయాం. ఇప్పుడు నేను ప్రేమికునిచే మోసగింపబడిన ప్రేమికురాలిని. తండ్రిలేని బిడ్డకు తల్లిని. బిడ్డనుకన్న అవివాహితని. ఈ లోకంలో కారకులైన లోకులకి ఏమని సమాధానం చెప్పుకోను. గుండెలో సంక్షోభంతో ఆరోజంతా రోదించాను.

నాలుగు రోజులు గడిచాయి.

బాబుని భుజం మీద వేసుకుని గదికి తాళం వేసి రోడ్డుమీదకు నడిచాను. ఇంటికి వెళ్దామా

## పూసలతో డిజైను



చిత్రం: డి. సుధాకర్‌రావు, గుంటూరు-21.

అంటే ఏ ముఖం పెట్టుకు వెళ్ళను! ఆత్మహత్య అయితే . ఛీ! ఛీ! అంత పాపపు పని చేసి పసి వాణ్ణి అనాథను చేయలేను! బాబుని పెంచి పెద్ద వాణ్ణి చేయాలి! బాబుకోసం బ్రతకాలి! బాబు కోసం బ్రతుకుతాను. దృఢంగా నిశ్చయించుకున్నాను. ఒక మేడ వద్దకు నడిచి కేకేసాను" ఆ యింటి యజమానురాలు వచ్చింది. "తమరి దగ్గర ఏదైనా పనివుంటే ఇప్పిస్తారని..." ప్రాధేయ పూర్వకంగా అన్నాను. ఇంతలో ప్రక్కనున్న లాడ్జింగ్ వైపు నుంచి ఒక అపరచిత వ్యక్తి "మీకు నేను ఇప్పిస్తాను రండి!" అంటూ నన్ను సమీపించాడు. వెంటనే ఆ ఇంటి యజమానురాలు లోపలికెళ్ళి పోయింది. క్షణంసేపు నాకు నోరుమాటరాలేదు. అసలే నిరుద్యోగం ప్రబలి పోయిన ఈ రోజుల్లో పిలిచి ఉద్యోగం ఇస్తానని అనటం నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. ఒక వేళ ఇందులో ఏదైనా మోసముందేమో నన్న అనుమానమూ కల్గింది. "నేను ఇందాక ట్నుంచీ గమనిస్తూనే వున్నాను! ఇంతకు ముందు మీ పరిస్థితుల్నికూడ చూసాను! మీరు చదువుకున్న వారిలా వున్నారు! మీకు అభ్యంతరం లేకపోతే మీకు కావలసిన మంచి ఉద్యోగం నా దగ్గరవుంది" అన్నాడు ఎంతో ఆప్యాయంగా. అతని దయార్ద్రతకు నా మనస్సు ఉప్పొంగింది మానవుల్లోకూడ దేవుళ్ళుంటారనిపించింది. "మాది రాజమండ్రి! మాకు రాజమండ్రిలో ఒక కంపెనీ వుంది! అక్కడకు వచ్చేస్తే చేసుకు బ్రతకొచ్చు!" అన్నాడు. అంతదూరం పెళ్ళటమా మానడమా అని నేను సంశయిస్తుండగా అతను మరల అన్నాడు. "మీరు ప్రయాణ ఖర్చులుగూర్చి ఆటే బాధపడనవసరంలేదు! నేనే స్వయంగా తీసుకెళ్తాను!" ఉద్యోగం ఇప్పిస్తానని అంత ప్రోత్సహించి నవ్వుడు చేజార విడుచుకుంటే కోరివచ్చిన స్వర్గాన్ని కాలదన్నుకోవటమే అవుతుందని వెంటనే అంగీకరించాను.

రాజమండ్రి స్టేషన్లో బండిదిగి రిక్షాలమీదఒక అందమైన మేడముందు ఆగాము. ఆ ఇంటి లోపల్నుంచి ఒక మనిషి బయటకి వచ్చాడు.నాతో వచ్చిన వ్యక్తిని నన్ను చూసి చిన్నగా నవ్వాడు. నేను రోడ్డుపక్కనే నిలబడి వున్నాను. వారిద్దరూ ప్రక్కకు వెళ్ళి ఏవో గుస గుసలాడుకున్నారు కాస్సేపటికి అతను వచ్చి నన్ను లోపల గదిలోకి తీసుకువెళ్ళాడు. "మీరు ఈ రోజుకి ఈ గదిలో వుండండి! రేపు ఉద్యోగంలో జాయినవుదురు గాని!... నేను వెళ్ళి మీకు క్యారేజిపట్టుకొస్తాను." అని అతను వెళ్ళిపోయాడు. గదిలోని పరిసరాలను పరికిస్తూ కూర్చున్నాను. నాకెందుకో ఆ వాతావరణం కొత్తగా వుంది. కాస్సేపటికి అతను క్యారేజి, ఫ్లాస్కుతో పాలు తీసుకొచ్చాడు. బాబుకి పాలు పట్టించి నేను భోజనం ముగించేటప్పటికి చీకటిపడి లైట్లు వెలిగినయ్. ప్రయాణ బడలిక వలన పెందిరాడే నిద్ర పట్టేసింది.

మంచి గాఢ నిద్రలో వున్నాను. నన్ను ఎవరో తట్టి లేపుతున్నారు. అకస్మాత్తుగా మెలకువ వచ్చి లేచాను. బెడ్లైట్ కాంతిలో ఒక పురుషుడు నా ఎదుట నిలబడి వున్నాడు. మల్లెపూలవాసన సెంటువాసనతో మిళితమై ఒక్కసారే గుప్పుమని వాసన వచ్చింది. నా పై ప్రాణాలు పైనేపోయినయ్. కామంతో అతని కళ్ళు మత్తుగా వున్నాయ్ అతని కబంధ హస్తాలు నన్ను చుట్టుముట్టినయ్ గింజుకున్నాను. రక్కాను, అరిచాను, ఏడ్చాను. నా మొర దేవుడు ఆలకించలేదు. అతని చేతులు ఏ మాత్రమూ పడలలేదు. అతని చేతిలో మల్లెపూలు నలిగిపోయాయి.

తన తృషను నెరవేర్చుకుని పోయాడు.


నాకు మెలకువ వచ్చేటప్పటికి తెల తెల వారుతోంది. జరిగిందంతా పీడకలలా గుర్తువచ్చింది. బాబుని చూసాను. బాబు లేడు నిర్ఘాంతపోయాను గదంతా కలియ తిరిగాను. ఎక్కడా లేడు. నాకు దుఃఖం పెల్లుబికింది. బయటికి వెళ్దామా అంటే తలుపు గొళ్ళెంపెట్టి వుంది. కన్నీరు కడవ లయ్యేలా ఏడ్చాను. రాత్రి జరిగిన సంఘటనకంటే బాబు కన్పించక పోవటం నాకు మరింత బాధ, విడ్డూరం కలిగించింది. భగవంతుడు నన్నెందుకింత బాధ పెడ్తున్నాడు. నేనేం పాపం చేసుకున్నాను. ఒక్కసారే నన్ను ఎందుకుచంపేయడు! గుండె క్షోభతో కుమిలి కుమిలి ఏడ్చాను,అప్పటికి పూర్తిగా తెల్లవారింది. ఎవరో ఒకతను వచ్చి తలుపుతీసాడు "నా బాబేడీ! నా బాబేడండీ! నా బాబు ఎక్కడున్నాడో చెప్పండీ!" అంటూ ప్రాధేయపడ్డాను. "నీ బాబు క్షేమంగా అనాధ శరణాలయంలో వున్నాడు. గాని ఆ పిల్లవాడి గురించి ఏమీ బెంగపెట్టుకోకు! నిశ్చింతగా వుండు!" అన్నాడు కటువుగా. నాకు దుఃఖం కట్టలు త్రెంచుకుంది. "నా బాబు లేందే నేను బ్రతకలేను! వాడెక్కడున్నాడో చూపించండి!" అంటూ అతని పాదాలు పట్టుకుని ప్రాధేయపడ్డాను. కొంతమంది వచ్చి నన్ను గదిలోకి త్రోసి తలుపులు బిగించారు. మానవుల్లో దేవుళ్ళుంటారని అనుకున్నాను. కాని మానవుల్లో దానవులుంటారని ఇప్పుడే అర్థమయింది. అప్పటికి పూర్తిగా నాకు అవగతమయింది. ఇది వ్యభిచార గృహమని. వేళకు భోజనం పంపేవారు. రాత్రులు విటుల్ని పంపేవారు.ఎంత ప్రయత్నించినా గత్యంతరం లేక లొంగిపోయేదాన్ని. పారిపోదామని ఎంత ప్రయత్నించినా, ఆ గది నుంచి కదలకుండ బంధించేవారు. బురదలో పూర్తిగా మునిగి పోయాను. ఇంక నాలో పవిత్రత యేముందని ఈ రొంపిలోంచి బయటికి వెళ్ళను! మలిన మైన ఈ శరీరం ఈ వేశ్యా గృహంలోనే ఇలాగే కుళ్ళి కృశించిపోవాలి!" అని అనుకున్నాను. ఇప్పుడూ అదే కోరుకుంటున్నాను. నా యీ దీనురాలిని చూసి రెండు కన్నీటిచుక్కలు విడిచేవారుంటే నా కదే చాలు!" గద్గదిక స్వరంతో వెక్కిళ్ళమధ్య ఆమె చెప్పటం ముగించింది. ఆమె కళ్ళవెంట నీళ్ళు ధారగా కారుతున్నాయి. కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా వున్నాయి. ముఖం కందిపోయి ఉబ్బింది. మదిలోని బాధను చెప్పుకోవటం వలన ఆమెకు కొంత ఉపశమనం కలిగినట్టయింది. తనకు తెలియకుండానే శ్రీధర్ కనులనుండి అశ్రువులు జారి పడుతున్నాయి.

మంచం మీదనుంచి లేచాడు. వాచి చూసుకున్నాడు. మసగ్గా కన్పిస్తోంది. అప్పటికి గాని శ్రీధర్ తేరుకోలేదు. ముఖం ప్రక్కకు త్రిప్పుకుని కర్చీప్తో కళ్ళు వత్తుకున్నాడు. అర్ధరాత్రి దాటింది. అసహనంగా అక్కడినుంచి కదిలి వెంటనే యింటికి వెళ్ళిపోయాడు శ్రీధర్.

* * *

రోజులు గడుస్తున్నాయి. రోజులే కాదు వారాలు కూడ గడుస్తున్నాయి. శ్రీధర్ ఆమె వద్దకు వెళ్ళటం పూర్తిగా మానేశాడు.

తన గత జీవితచరిత్రని చెప్పినప్పట్నుంచీ శ్రీధర్ రాకపోవటానికి గల కారణం ఏమిటో ఆమెకు అర్థం కాలేదు. తనంటే ఒక విధమైన అభిమానం చూపే అతను తన దుస్థితికి దారితీసిన గాథను చెప్పినప్పట్నుంచీ అకస్మాత్తుగా తన వద్దకు రాకుండా "అసలు కన్పించక పోవటం" కి వెనక వున్న బలమైన కారణం ఏమిటో ఆమెకు అంతు చిక్కలేదు ఒక వేళ తనకూ అతనికీ ఏదైనా సంబంధం వుందా? లేకపోతే



యీ పరాత్పరిణామానికి మూలకారణ మేమిటి? ఏదో సంబంధం వుండే వుంటుంది! అది అనుబంధమో ఆగ్రహమో! ఏమో! కారణం తెలుసుకోవాలి!" ఆమె మస్తిష్కంలో రక రకాల ఆలోచనలు ఉత్పన్న మైనాయ్.

*   *   *

ఒకరోజు తెల్లవారుజామున ఆ గృహంనుంచి బయటికి వచ్చి రోడ్డుముందుకు నడిచిందామె.

చిక్కటి చీకటి

కన్నెపిల్ల కళ్ళల్లోని కాటుకవంటి చీకటి

మునిసిపల్ వీధి దీపాలు తమ ప్రకాశాన్ని చూపి చీకటిని చీల్చటానికి ప్రయత్నిస్తున్నాయి

అంతకుముందు తనకు చెప్పిన పేరు, ఇంటి వివరాల్ని బట్టి ఒక ఇంటిముందుకు నడిచింది.

బయట విద్యుద్దీపపు కాంతిలో బోర్డు చూసింది. "జడ్. శ్రీధర్, ఎమ్. డి. సి." అని వుంది

వేడిగా నిట్టూర్చింది

ప్రక్కఇంటిలోని గడియారం నాలుగుగంటలు కొట్టింది

కిటికీలోంచి తొంగి చూసింది.

కరెంటు దీపపు కాంతిలో మంచం మీద శ్రీధర్ ప్రక్కన వున్న శారదను చూసి షాక్ తిన్నట్లయింది.

కొన్ని క్షణాలు అచేతనంగా నిలబడిపోయింది ఆమె

అప్రయత్నంగా ఆమె కనుల నుంచి కన్నీటి



చుక్కలు రాలినయ్.

అంతా గాఢంగా నిద్రపోతున్నారు. ఒకతలుపు వేసి మరో తలుపు కొద్దిగా తెరచీ తెరవనట్టుగా వుంది.

తలుపు నెమ్మదిగా త్రోసి లోనికి వెళ్ళింది.

టేబిల్ మీదున్న పెన్ను ఒక కాగితం తీసుకొని ఏదో వ్రాసి కాగితాన్ని మడత పెట్టింది.

మంచం వద్దకు నడిచింది,

కాగితాన్ని మంచం మీద పెట్టింది.

ఆమె శరీరం కంపిస్తోంది.

వణుకుతున్న చేతులతో శారద పాదాలకు నమస్కరించింది శ్రీధర్ పాదాలను తాకబోయి చేతులు వెనక్కు లాక్కొని దూరాన్నుంచే నమస్కరించింది.

త్వరగా అక్కడ్నించి బయటకు నడవబోతూండగా తలుపు తగిలి పెద్ద శబ్దం వచ్చింది.

ఒక్క ఉదుటున ఆమె రోడ్డుమీదకు పరుగెత్తింది.

ఆ శబ్దానికి శ్రీధర్ తృళ్ళిపడి లేచాడు. తలుపు బార్లాగా తెరచి వుంది

బయటకి పరుగెత్తాడు.

అప్పటికే ఆమె చీకటిలో కలిసిపోయింది.

కొంత దూరం పరుగెత్తి విఫలుడయి, తిరిగి వచ్చాడు శ్రీధర్, అప్పటికి శ్రీధర్ భార్య శారద లేచింది.

శ్రీధర్ లోపలికి వచ్చి పరిసరాలూ నిశితంగా పరీక్షిస్తుంటే మంచంమీద కాగితం కన్పించింది

ఆత్రంగా విప్పి చదవటం ప్రారంభించాడు:

అక్కయ్యకు, బావగార్కి

ఇదే నా అంతిమ నమస్కారములు ఒక్కొక్కరికి జీవితం భగవంతుడు ప్రసాదించిన వాటి బాట అవుతుంది, ఒక్కొక్కరికి ముళ్ళ బాట అవుతుంది. నా జీవితం రెండో కోవకు చెందింది. వయస్సులో వున్న కన్నె పిల్లలు కనే తియ్యటి కలల్ని నేనూ కన్నాను. కాని నా జీవితంలో పూర్తిగా ఓడిపోయాను ఈ మనుషుల్ని నమ్మకూడదు దేవుణ్ణి నమ్ముకుంటే కష్టాలు తొలగిపోతాయి. కాని ఈ మనుషుల్ని నమ్ముకుంటే కష్టాలు కలుగుతాయి. జీవితాలు మంట గలుపుతారు. మనుషుల్ని మోసేస్తారు. నాజీవితాన్ని అందాలవనంగా చేసుకొని హాయిగా విహరిద్దామనుకున్నాను నా మనో నేత్రం చూపిన మార్గాన్ని అనుసరించాను. తత్ఫలితం మోసగించబడ్డాను. చివరి... తండ్రిలేని తనయుని పెంచి పెద్ద చేసి తల్లిగానైనా ఆనందిద్దామని ఆశించిన నాకు ఆ ప్రయత్నంలో కూడ రెండోసారి మోసగించబడాను ఫలితం చెప్పాలి ఇంక . ఈ లోకంలో ఎవరిని నమ్మాలి? రెండు హృదయాలు గాఢంగా పెనవేసుకున్నప్పుడు ఉద్భవించేది "ప్రేమ". ఓ రకంగా చెప్పుకోవలసి వస్తే (నా దృష్టిలో) ఆ "ప్రేమ"ను రెండు విధాలుగా విభజించవచ్చు. ఒకటి కలకాలం నిలిచేది. రెండవది తాత్కాలికమైనది. అంటే పాల పొంగులాంటిది. నా ఈ హేయమైన జీవితానికి రెండవదే నాంది పలికింది.

నా బాబుని వెదికి అనాథ శరణాలయంనుంచి మాత్రం తీసుకురాకండి. వాడు అడిగే ప్రశ్నలకి ఎవ్వరూ సమాధానం చెప్పలేరు. నా తల్లి దండ్రు లెవరూ అని విలపిస్తూ, వాడు బ్రతికుండి క్షణ క్షణం చావటం నా కిష్టంలేదు. నా మీదల మీకు ఏమాత్రం దయవున్నా ఆ పనిమాత్రం చేయవద్దు. తల్లి తండ్రీలేని వాన్ని అలాగే బ్రతుక నివ్వండి ఆ సున్నిత హృదయానికి గాయమయితే నా ఆత్మకు శాంతి వుండదు. ఇదే నా చివరి కోరిక

నేను ఒకరికి చెప్పేటంతటి దానను కాకపోయినా, నా అనుభవాన్ని చదివితే సోదరీమణులైన నాలాంటి కన్నెలు యికముందయినా తెలివి గలిగి తమ జీవితాల్ని సుఖమయం చేసుకుంటారని ఆశిస్తున్నాను. యవ్వనంలో వున్న యువతి గాని, యువకుడు గాని ప్రేమ, ప్రేమ అంటే అది కామోద్రేకమే లవుతుంది. ఇలా అన్నానని నా మీద ఆగ్రహించకండి. కేవలం శారీరక వాంఛల్ని తీర్చుకోవాలన్న తృష్ణతోగాక ఆమె లోని లేక అతనిలోని సత్ప్రవర్తన, మంచి గుణాల్ని చూసి మనసారా ప్రేమించేవాళ్ళు వున్నారు. ప్రేమించుకోవచ్చు. కాని ఆ ప్రేమ స్త్రీ జీవితానికి పునాదులు పడ్డేలా వుండాలి. కాని వీటిబుగ్గ కాకూడదు. ఆప్యాయత, మంచి మనస్సు, ఆరాధన వీటితో నిండివున్నదే "ప్రేమ" అటువంటి సహృదయత లేని ప్రేమ తీపిలేని చెరకు గడలాంటిది. నాలాంటి ప్రేమ వాసనలేని పువ్వులాంటిది మనిషికి వయస్సే అనుభవాలు పుట్టు. నా వయస్సు చిన్నదే కాని పెద్ద అనుభవాన్ని నేర్పింది నాకు మనుగడ సాగించాలంటే మనిషికి మనిషి మీద నమ్మకముండాలి ఒకరి మీద మనిషిలో "ప్రేమ" పుట్టినప్పటి నుంచీ ఆ మనిషి చచ్చేవరకు అతనిలో ఆ "ప్రేమ" సజీవంగా వుంటేనే ఆ "ప్రేమ" అనే పదానికి సార్థకత నిచ్చినవారవుతారు ఇంకా... ఇంతకన్న ఏమి చెప్పగలను?

ఇట్లు,
మాధవి.

శారద కొయ్యబారి బొమ్మలా నిల్చుండిపోయింది. శారద నయనాల నుండి రెండు అశ్రువులు రాలి క్రింద పడినవి. శ్రీధర్ వదనంలో మార్పేమీ లేదు మామూలుగనే వున్నాడు. అతని మనస్సు కొన్ని రోజుల్నుంచి ఎక్కువెత్తో ఎంతో వికలంగా వుంది ఇప్పుడు మాత్రం మాధవి మీద సానుభూతిలో నిండివుంది

తెల్లవారేటప్పటికి మాధవి శవం గోదావరిలో కొట్టుకుపోతూంది గంగాదేవి ఒక అభాగినిని తన ఒడిలోకి చేర్చుకుంది.

★